క్లుప్తంగా

రూ.50 లక్షలతో ఆంజనేయ ఆలయ నిర్మాణం



ముద్దలాపురంలో నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయం

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం పాతబడి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నూతన ఆలయాన్ని నిర్మించాలని ప్రజలు సంకల్పించారు. విరాళాలు ఇచ్చేందుకు ప్రజలు ముందుకొచ్చారు. సుమారు రూ.50 లక్షలతో ఆలయం నిర్మాణం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 31న ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు.

దుర్గం డీఎస్పీగా రవిబాబు



సిబ్బందితో మాట్లాడుతున్న నూతన డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం నూతన డీఎస్పీగా రవిబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు బదిలీపై అనంతపురం ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అనంతపురం ఇంటెలిజెంట్ విభాగంలో పనిచేస్తున్న రవిబాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నియోజవర్గ పరిధిలోని సీఐలతో సమావేశం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

కళ్యాణదుర్గం రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాలమాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతలల్లో అభివృద్ధి పై శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

బుద్దదేవ్ భట్టాచార్య జీవితం ఆదర్శప్రాయం



బుద్దదేవ్ భట్టాచార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రాయదుర్గంటౌన్: బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్ర నేత బుద్దదేవ్ భట్టాచార్య జీవితం ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున తెలిపారు. ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో సీపీఎం నాయకులు బుద్దదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధు, తిమ్మరాజు, హనుమంతు, ఉమేష్, ఓబులేషు, నాగేంద్ర, అంజి, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై, మొక్కులు తీర్చుకున్నారు.

దాతలు గ్రాసాన్ని అందించండి



కూడేరులోని సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద గోశాల

కూడేరు: మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి ఆలయ సమీపంలోని గోశాలకు దాతలు గ్రాసం ఇవ్వాలని నిర్వాహకుడు ప్రవీణ్ ఆదివారం కోరారు. సంగమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సుమారు 70 వరకు ఆవులు ఇచ్చారని, గ్రాసం కొరతతో పోషణ భారంగా మారుతోందన్నారు. దాతలు ఇచ్చిన గ్రాసం సరిపోవడం లేదని, దాతలు మరింతమంది ముందుకొచ్చి, గోవుల సంరక్షణకు సహకరించాలని కోరారు. మరింత సమాచారం కోసం సెల్: 9989159842లో సంప్రదించాలన్నారు.

రైతుల ఆశలు ఆవరి

- వరి సాగు చేసేందుకు అన్నదాతల అనాసక్తి
- బోరుబావుల్లో తగ్గిన భూగర్భజలాలు
- పెరుగుతున్న పంటల సాగు పెట్టుబడి



నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్న వరి నారు



వరి నాట్లు వేస్తున్న దృశ్యం

కూడేరు: వర్షాభావంతో ఈ ఏడాది వేరుశనగ పంట సాగు ఆశించిన స్థాయిలో లేదు. అరకొర నీటి తడులతో ప్రత్యామ్నాయంగా వరి సాగు చేద్దామంటే బోరుబావుల్లో భూగర్భజలాలు అంతంతమాత్రమే.. దీనికితోడు సాగుకు పెట్టుబడి కూడా ఏటేటా పెరిగిపోతోంది. ఆశించిన స్థాయిలో దిగుబడి, రాబడి రాదేమోనని రైతులు సాగుకు అనాసక్తి చూపుతున్నారు. దీంతో కూడేరు మండలంలో ఈ ఏడాది ఆశలు ఆ 'వరి' అవుతున్నాయి. కూడేరు మండలంలో ఖరీఫ్‌లో వరి పంట సాగు సుమారు 2,000 ఎకరాలకు పైగానే ఉంటుంది. కానీ ఈ ఏడాది బోరు బావుల్లో నీటి అరకొరగానే వస్తోంది. దీనికితోడు విద్యుత్ సరఫరాను దృష్టిలో పెట్టుకొని అధిక విస్తీర్ణంలో వరి పంట సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. ఐదెకరాలు వరి సాగు చేసే రైతులు 3 ఎకరాలు , మరికొందరు ఎకరా నుంచి 2 ఎకరాల్లో సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు ముందస్తుగా వరి నారు పోసుకుని నాట్లు వేసుకున్నారు. మరికొందరు పొలాల్లో వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. కూడేరు, ఇప్పేరు, జల్లిపల్లి, కొర్రకోడు, ఉదిరిపికొండతో పాటు మరికొన్ని గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 600–800 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అమాంతం పెరిగిన బియ్యం ధరలు ...

వరి సాగు విస్తీర్ణం పెరిగినా బియ్యం ధరలు కూడా ఏటేటా అమాంతం పెరిగిపోతున్నాయి. వరి పంట సాగుకు అధికంగా నీరు అవసరం. ఖరీఫ్‌లో బోరు బావుల కింద వరి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి ఆదాయాన్ని పొందుదామని అన్నదాతలు భావిస్తున్నారు. కానీ గత ఏడాది నుంచి నెలకొన్న వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఫలితంగా వ్యవసాయ బోర్లలో నీరు అరకొర వస్తోంది. మరోవైపు పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో అన్నదాతలు వరి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

వరి సాగుకు రూ.20 వేల పెట్టుబడి:

అన్నదాతకు కాడెద్దులు కరువయ్యాయి. యంత్రాలపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సి వస్తోంది.దీంతో పంటల సాగు పెట్టుబడి ఖర్చు పెరిగిపోతోంది. ట్రాక్టర్‌తో నేలను దుక్కి చేయాలంటే గంటకు రూ.1,200 బాడుగ చెల్లించాల్సి ఉంటుంది. ఎకరా నేలను దుక్కి చేయడానికి 4 గంటల వరకూ సమయం పడుతుండడంతో రూ.4,800 ఖర్చవుతోంది. వరినారు పెంచడానికి 50 కేజీల వడ్ల ప్యాకెట్ కావాల్సి ఉంటుంది. నాణ్యతను బట్టి ప్యాకెట్ రూ.1,200 ఉంటుంది. వరి నాట్లు వేయడానికి కూలీలకు సుమారు రూ.4,000 వరకు ఇవ్వాల్సి ఉంటుంది. వరి నాటే సమయంలో రూ.2,000 వరకు ఎరువులు, మధ్యలో పంట పెరగడానికి ,తెగుళ్ల నివారణకు సుమారు రూ.4,000 వరకు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు సుమారు రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతోంది.

వరి సాగు చేయలేదు

ఎనిమిది ఎకరాల భూమి ఉంది. అందులో బోరు ఉంది. వర్షాభావంతో బోరు బావిలో నీరు అడుగంటి పోయింది. అరకొరగా నీరు వస్తోంది. వరి పంట సాగు చేయాలంటే నీరు ఎక్కువగా ఉండాలి. నీరు బాగా ఉన్నప్పుడు 4 ఎకరాల వరకు వరి పంట సాగు చేసేవాడిని. నీటి కొరతను, పెరుగుతున్న పెట్టుబడిని దృష్టిలో పెట్టుకొని ఈసారి వరి పంట సాగు చేయలేదు.

– ఆర్.వెంకటేశులు, రైతు, ముద్దలాపురం గ్రామం, కూడేరు మండలం

ధైర్యం చేయలేకపోతున్నా..

మామూలుగా 5 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేసేవాడిని. వర్షాభావంతో పాటు, పొలం సమీపంలో ఉన్న చెరువులోకి నీరు విడుదల కాలేదు. దీంతో బోరు బావిలో నీరు అరకొరగా వస్తోంది. ఎక్కువ విస్తీర్ణంలో వరి పంట సాగు చేయలేక పోతున్నా. బోరుబావిలో వచ్చే నీటిని బట్టి ఎకరా విస్తీర్ణంలో వరి పంట సాగు చేయాలని నారు పెంచేందుకు సిద్ధం చేసుకున్నా.

– శంకర నారాయణ రెడ్డి, రైతు, రామచంద్రాపురం, కూడేరు మండలం

పంటలు ఎండుతున్నాయని ఆందోళన



ఆవులదట్లలో సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- సబ్‌స్టేషన్‌కు తాళం వేసి జాతీయ రహదారిపై రైతుల నిరసన

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మండలంలోని ఆవులదట్ల గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. అనంతపురం–రాయదుర్గం జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. దాదాపు అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆవులదట్ల ఫీడర్ పరిధిలో ఆవులదట్లతోపాటు పరిసర గ్రామాలకు చెందిన దాదాపు 800 మందికి పైగా రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసుకున్నట్లు చెప్పారు. వారంరోజుల నుంచి కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు సమస్యకు పరిష్కారం చూపకుండా సాకులతో చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాల్సిన అధికారులు కనీసం గంట లేదా రెండు గంటల పాటు మాత్రమే సరఫరా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

ఏపీ రైతు సంఘం రాయదుర్గం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ తొమ్మిది గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 74 ఉడేగోళం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణం సమస్యను పరిష్కరించకపోతే రాయదుర్గంలో విద్యుత్ కార్యాలయాన్ని రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- మాజీ ఎంపీ తలారి రంగయ్య



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పడమటి కోడిపల్లి గ్రామ పంచాయతీలోని గొల్లలదొడ్డిలో ఇటీవల జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వలేదని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎంపీ రంయ్య పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు దాడి చేయడం సరికాదని, వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడిన కార్యకర్తలకోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కరణం రాహుల్, ఎంపీటీసీ నరసింహులు, మండల యూత్ కన్వీనర్ కొండాపురం రాము, మహేష్‌స్వామి, మోహన్ , గోవిందు, ఆంజనేయ భద్ర, నరసింహ మూర్తి, పాలయ్య మంజు, తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న రంగయ్య



బోరంపల్లిలో వివాహ వేడుకల్లో పాల్గొన్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ కుమార్తె వివాహ వేడుకలో మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆదివారం పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, నాయకులు కృష్ణరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రామిరెడ్డి, గోళ్ల సూరి, దొడగట్ట సూరి, ఎంఎస్ రాయుడు, కైరేవు ప్రతాప్, రాజు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై సంత..తప్పని ట్రాఫిక్ చింత



గాంధీ సర్కిల్ వద్ద నడిరోడ్డుపై కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. కూరగాయల మార్కెట్, ఓబుళాచారి రోడ్డు, అనంతపురం వైపునకు ఇటు వినాయక సర్కిల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్నారు. ఇలాంటి చోట నడిరోడ్డుపై చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, కూరగాయలు, ఆకుకూరాల వ్యాపారాలను చేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో పాదాచారులు, వాహనదారులు ఈమార్గంలో రావాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పరిస్థితిని చక్కదిద్ది ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాల్సిన పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు అంటున్నారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల దాకా ప్రధాన రహదారిని ఆక్రమించి, వ్యాపారం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ సమయంలో టవర్‌క్లాక్‌ను తొలగించిన అధికారులు.. వీ ఆకాంలో ప్రహరీ నిర్మించారు. దీన్ని ఆనుకొని చుట్టూ తోపుడు బండ్ల వ్యాపారులు సంతగా మార్చేశారు. కూరగాయల మార్కెట్, వినాయక సర్కిల్ నుంచి రాకపోకలకు ఏమాత్రం స్థలం వదలకుండా రోడ్డుపైనే తోపుడు బండ్లను ఉంచుతుండడంతో సమస్య తలెత్తుతోంది.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న రెండు మరుగుదొడ్లు

కూడేరు: కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయానికవెళ్లే ప్రధాన ద్వారం పక్కనే స్వచ్ఛ భారత్ పథకం కింద రెండు మరుగుదొడ్లను నిర్మించారు. కార్యాలయ ఆవరణలో ఉన్న సచివాలయాల వద్దకు పనులు నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం ఒక్కో మరుగుదొడ్డి రూ.3 లక్షలు చొప్పున వెచ్చించి నిర్మించారు. కానీ మరుగుదొడ్లు ప్రారంభానికి నోచుకోలేదు. ఫలితంగా రూ.6 లక్షల ప్రజా ధనం వృథా అయ్యింది. కార్యాలయ ఆవరణలో వెలుగు, హార్టికల్చర్, వ్యవసాయ, ఉపాధి హామీ కార్యాలయాలు ఉన్నాయి. పనుల నిమిత్తం అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. మూత్ర విసర్జనకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక కార్యాలయ ఆవరణలో బహిరంగ ప్రదేశంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న కల్పవల్లి సొసైటీ సీఈఓ చిరంజీవి

చెన్నేకొత్తపల్లి: పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కీలకమని కల్పవల్లి సీఈఓ చిరంజీవి అన్నారు. టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న కల్పవల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ముష్టికోవెల సమీపంలోని కల్పవల్లి అటవీ ప్రాంతంలో రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని యువతకు పర్యావరణ పరిరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ.. 1992 నుంచి పర్యావరణాన్ని ఏ విధంగా కాపాడుకోవాలి అనే దానిపై యువతకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. యువత పర్యవరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. వన సంరక్షణ కమిటీలు చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో కల్పవల్లి సొసైటీ అధ్యక్షుడు వెంకట రమణప్ప, కల్చరల్ కో–ఆర్డినేటర్ రవి, డైరెక్టర్లు, కల్పవల్లి సిబ్బంది బాలమురళి, ఆదినారాయణ, ముఖేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోసేవ

అనంతపురం కల్చరల్: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోసేవలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగరంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న ఇస్కాన్ గోశాల, సోములదొడ్డి అభయాంజనేయ స్వామి ఆలయంలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. గోవులకు పశుగ్రాసం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు ప్రమోద్ స్వామి మాట్లాడుతూ.. గోసేవ ప్రాముఖ్యతను తెలిపారు. ముక్కోటి దేవతల ప్రతిరూపమైన గోసేవతో సకల పుణ్యాలు కల్గుతాయన్నారు. అందులోనూ శ్రావణంలో చేసే పూజల వల్ల విశేష పుణ్యఫలముంటుందన్నారు. కార్యక్రమంలో గోసేవకులు రాము, ప్రసాద్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



సీతారాములు,లక్ష్మణ, ఆంజనేయ దేవతామూర్తులకు పూజలు నిర్వహించిన దృశ్యం



బెళుగుప్ప: ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని రమనేపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్టను వేద పండితుల మంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. వేదపండితులు కేరళ శ్రీరంగం సరస్ మోహన్ గురూజీ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ హోమాలు నిర్వహించారు. ఆలయం ముందు ధ్వజ స్తంభ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. సీతారాములను దర్శించుకున్నారు.భక్తులకు అన్నదానం చేశారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

శెట్టూరు: మండలంలోని కరిడిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అమర వన్నూరప్ప (60) గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. వన్నూరప్ప భౌతిక ఖాయానికి వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కోసం అమర వన్నూరప్ప కృషి చేశారని, ఆయనలేని లోటు తీరనిదన్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ బొమ్మజ్జి రమేష్, పోస్ట్ రామకృష్ణ, బాబురావు, గౌరయ్య, గోవిందు, వన్నూరప్ప, వీరేష్, శ్రీరాములు, ఐద్రి, నరసింహప్ప, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాం గేట్‌కు మరమ్మతులు చేయాలి

అనంతపురం అర్బన్: కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్యామ్ భద్రతపై పర్యవేక్షణ లేకపోవడం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. గేటు కొట్టుకుపోవడంతో 35 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోందని పేర్కొన్నారు. మిగిలిన గేట్ల పటిష్టతను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో వర్షాలు కురవక కరువు నెలకొన్న ఈ పరిస్థితుల్లో తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడం బాధాకరమని తెలిపారు. మరమ్మతు పనులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలన్నారు.

గోళ్ల పంచాయతీకి జాతీయ స్థాయి గుర్తింపు



గోళ్ల సర్పంచు కవిత

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని గోళ్ల పంచాయతీకి జాతీయ స్థాయిలో గుర్తుంపు వచ్చినట్లు ఎంపీడీఓ సాలమాన్, ఈఓఆర్‌డీ బాలాజీ తెలిపారు. సర్పంచ్ కవిత పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారు. ఢిల్లీలో ఈనెల 15 గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చింది.

పండ్ల తోటల రైతులకు ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: పండ్ల తోటల రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని కుసుమగిరి రైతు సంఘం కోఆర్డినేటర్ నరసింహామూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుందుర్పి మండలంలోని వక్క తోటలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా కోఆర్డినేటర్ నరసింహామూర్తి మాట్లాడుతూ బోరు బావుల కింద సాగు చేసిన పండ్ల తోటల రైతులకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. 10 సెంట్ల నుంచి పదెకరాల వరకు సాగుచేసి రైతులకు కుసుమగిరి రైతు సంఘం నుంచి సాయం అందిస్తామన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 7013699541లో సంప్రదించాలని,కుందుర్పిలోని కుసుమగిరి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వర్షంకోసం కప్ప ఊరేగింపు



కమలపాడులో వర్షం కోసం కప్పను ఊరేగిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల పరిధిలోని కమలపాడులో వర్షం కురవాలని కప్పను ఊరేగించారు. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన యువకులు, చిన్నారులు తదితరులు గ్రామ పుర వీధుల గుండా కప్పను ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం కప్పను బావిలో వదిలారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు



సేవలందించిన యువతులకు జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని రెయిన్‌బో బాలికల అనాథాశ్రమంలో ఆదివారం ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలలో జరిగిన కార్యక్రమానికి రెయిన్‌బో హోమ్ అధ్యక్షుడు సద్దాం బాషా ముఖ్య అతిథిగా విచ్చేసి రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అందరిలో అవగాహన పెంచాలని సూచించారు. కేవలం స్వచ్ఛందంగా వచ్చే సేవాభావం కల్గిన వారి వల్లే ఎంతో మందికి రక్తం అందుతోందన్నారు. అనంతరం వందలాది మందికి ఉచిత రక్తగ్రూపు పరీక్షలు నిర్వహించి సేవాభావంతో సహకరించిన వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ డ్రాప్స్ సంస్థ అధ్యక్షులు సర్దార్‌వలి, ముజహిద్, మహ్మద్ రాకీబ్, శ్రీధర్, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన



వధూవరుల వివరాలు నమోదు చేసుకుంటున్న రెడ్డి సంఘం నాయకులు

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం రూరల్ పాపంపేటలో నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక'కు మంచి స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రెడ్డి కులస్తులు వధూవరుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా రెండో ఆదివారం ఈ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్ రెడ్డి, నాయకులు దుబ్బ కిషోర్‌రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరత్నారెడ్డి, రమణారెడ్డి, బలరామిరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.